
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
గురువారం 14 మార్చి 2024



భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 19.0

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6 :20 (గురు)
సహరి : 4 :49 (శుక్ర)

యుద్ధం సిద్ధం..!



తుది జాబితాల్లో ప్రధాన పక్షాలు

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేందుకు కొద్దిరోజులే మిగిలి వుండగా ఈలోపే అభ్యర్థుల జాబితా విడుదలకు ప్రధాన పక్షాలన్నీ సిద్ధం అయ్యాయి. మూడు పార్టీల కూటమి ఇప్పటికే మూడొంతులు అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులను ఖరారు చేయగా, మిగిలిన స్థానాల జాబితాను నేడో, రేపో ప్రకటించనున్నారు. అధికార వైసీపీ ఉమ్మడి జిల్లాలో అన్ని అసెంబ్లీ, ఎంపీ స్థానాలకు ఈనెల 16న గంపగుత్తగా ప్రకటించనుంది. కాంగ్రెస్, కమ్యూనిస్టుల కూటమి సీట్ల విషయంలో తేల్చుకోవాల్సి ఉండగా, కాంగ్రెస్ అభ్యర్థుల కొందరి పేర్లను శనివారం లోపు విడుదల చేస్తారు.

- ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి

- ఎంపీ స్థానాల్లో ఆకస్మిక పరిణామాలు
- నలుగురు అభ్యర్థులకు జనసేన గ్రీన్‌సిగ్నల్
- తేల్చాల్సింది పోలవరమే..
- కైకలూరు నుంచి బీజేపీ
- అధికార వైసీపీ జాబితా ఈ నెల 16న
- సీఎం జగన్‌తో మంత్రులు, ఎమ్మెల్యేల భేటీ
- దెందులూరులో తేల్చబోతున్న టీడీపీ
- కాంగ్రెస్,కమ్యూనిస్టుల సుదీర్ఘ కసరత్తు



ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాల్లో పొత్తులో భాగంగా ఎవరికి కేటాయించిందీ స్పష్టత లేక తీవ్ర కసరత్తుకు దారితీసింది. ఈ రెండు స్థానాల్లో ఒక స్థానాన్ని ఖచ్చితంగా బీజేపీ కోరుకుంటోంది. నరసాపురం స్థానాన్ని మాత్రమే మిగుల్చుకుని ఏలూరును వదిలేయాలని బుధవారం వరకు ఆ పార్టీలో చర్చ సాగింది. కానీ బుధవారం పరిణామాలు వేగంగా మారాయి. ఆరెస్సెస్ నుంచి ఒత్తిడి పెరగడం, ప్రజల్లో ఒకింత పట్టున్న నాయకుడు గారపాటి చౌదరిని వదులుకోవడం ఇష్టం లేక పార్టీ పునరాలోచనలో పడినట్టు సమా చారం. ఉమ్మడి పశ్చిమలో ఉన్న ఈ రెండు లోక్‌సభ స్థానాల్లో ఒక స్థానాన్ని మాత్రమే పొత్తులో భాగంగా ఎంపిక చేసుకోవచ్చని తెలుగుదేశం, జనసేన ఇచ్చిన ఛాన్స్ వినియోగించుకోవడానికి బీజేపీ ముప్పుతిప్పలు పడుతోంది. ఒకానొక దశలో నరసాపురం బీజేపీకీ, ఏలూరు టీడీపీకి అనే ప్రచారం, ఆ రీతిలోనే నేతల మధ్య చర్చ సాగింది. కానీ దీంతో ఏలూరులోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపన చౌదరి, ఆయన అనుచర వర్గం కొంత అసంతృప్తికి గురై ఈనెల 15న ఏలూరులో ఆత్మీయ సదస్సుకు ముహూర్తం పెట్టారు. గారపాటి చౌదరి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తారంటూ ప్రచారం సాగినా దానికి విరుద్ధంగా బీజేపీ నుంచి అనుకూల సంకేతాలు వెలువడినట్టు చౌదరి వర్గీయులు చెబుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆరెస్సెస్ ముఖ్యులు జోక్యం చేసుకున్నట్టు, ఢిల్లీ స్థాయిలో ఏలూరులో జరుగుతున్న పరిణామాలను చేరవేసినట్టు సమాచారం. దీంతో గారపాటిని కాస్త ఓపిక పట్టాల్సిందిగా సంకేతాలు ఇచ్చారు. ఏలూరును బీజేపీ సమర్థించుకుంటే నరసాపురం టీడీపీ ఖాతాలో చేరబోతోంది. నరసాపురం నుంచి సిట్టింగ్ ఎంపీ రఘురామకృష్ణంరాజు బరిలో దిగేందుకు సిద్ధపడుతున్నట్టు సమాచారం. మంగళవారం వరకు రఘురామ ఏ పార్టీ తరపున పోటీ చేస్తారనే విషయంలో ఎవరిష్టం వచ్చినట్లుగా వారంతా రకరకాల అంచనాలు వేశారు. ఈ వ్యవహారం అంతా గురువారం నాటికి పూర్తి స్పష్టత రానుంది. మరోవైపు టీడీపీ పక్షాన ఎంపీ స్థానానికి గోరుముచ్చు గోపాల్ యాదవ్, కంభంపాటి రామ్మోహన్ పేర్లతో పాటు కొత్తగా ఉన్నత పోలీసు అధికారి సత్యనారాయణ గౌడ్ పేరు బుధవారంనాడంతా తెలుగుదేశం వర్గాల్లో చక్కర్లు కొట్టాయి.


బీజెపీలో ఇంకా కసరత్తు

భారతీయ జనతా పార్టీ తన అభ్యర్థుల ఎంపికలో జాబితా విడుదలలో ఇంకా జాప్యం చేస్తూనే ఉంది. ఉమ్మడి పశ్చిమలో ఒక పార్లమెంట్, ఒకటి లేదా రెండు అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ పోటీ చేయగలదని అందరూ భావించారు.

అయితే దీనికి విరుద్ధంగా ఏలూరు జిల్లాలో భాగమైన కైకలూరు నుంచి మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను రంగంలోకి దించబోతున్నారు. ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాల్లో ఒక స్థానం నుంచే బీజేపీ తన అభ్యర్థిని రంగంలో దించబోతోంది. ఇప్పటికే జనసేన తన అభ్యర్థులను ప్రకటించినందున ఇప్పటివరకు సాగిన ఊహాగానాలన్నీ తేలిపోయాయి.

జాబితాతో వైసీపీ సిద్ధం

ఇప్పటికే కొన్ని మార్పులు చేర్పులతో జాబితాను సవరించిన అధికార వైసీపీ ఈ నెల 16న తుది జాబితా విడుదలకు సిద్ధం అవుతోంది. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ. పార్లమెంట్ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల జాబితా విడుదల చేయడం ద్వారా తనదైన మార్క్ ప్రదర్శించాలని ఆ పార్టీ తహతహ లాడుతోంది. ఈలోపు మంగళవారం తాడేపల్లిలో గోదావరి జిల్లాల నియోజకవర్గ కన్వీనర్లు, మంత్రులు, సిట్టింగ్ ఎమ్మెల్యేలతో సీఎం జగన్ ముఖాముఖి భేటీ అయ్యారు. ఆలస్యంగా ఈ సమాచారం బయటకు వచ్చింది. ఉమ్మడి పశ్చిమ నుంచి 15 మంది సీఎంతో భేటీకి హాజరయ్యారు. 'మీరంతా రంగంలో దిగండి.. ఎక్కడా వెనుకబడొద్దు... ప్రజల్లోకి వెళ్లండి, ప్రతి అవకాశాన్ని వినియోగించు కోండి..' అని సీఎం హితవు పలికారు. అంటే ఇక ఎలాంటి మార్పులు చేర్పులు ఉండవని ఈ సమావేశానికి వచ్చినవారంతా అభ్యర్థులే అన్నట్లుగా స్పష్టత ఇచ్చారు. ఏలూరు నుంచి ఆళ్ళ నాని, ఉంగుటూరు నుంచి పుప్పాల వాసుబాబు, చింతలపూడి నుంచి విజయరాజు, పోలవరం నుంచి రాజ్యలక్ష్మీ, కొవ్వూరు నుంచి తలారి వెంకట్రావు, గోపాలపురం నుంచి మంత్రి తానేటి వనిత, నిడదవోలు నుంచి శ్రీనివాసులు నాయుడు, తణుకు నుంచి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, తాడేపల్లిగూడెం నుంచి మంత్రి కొట్టు సత్యనారాయణ, నరసాపురం నుంచి ప్రసాదరాజు, భీమవరం నుంచి గ్రంధి శ్రీనివాస్ పేర్లను అధికారికంగా ఈనెల 16న ప్రకటించనున్నారు. పాలకొల్లు కన్వీనర్‌గా వున్న గుడాల గోపి, ఉండి సమన్వయకర్తగా వున్న పీవీఎల్ నరసింహరాజుకు సైతం దాదాపు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఉండి నుంచి పీవీఎల్‌కు బదులుగా వేరొకరు వచ్చే ఛాన్స్ వుందని ఇప్పటివరకు పుకార్లు షికారు చేయగా, అది కాస్తా దాదాపు వీగిపోయింది. మిగతా జిల్లాలతో పోలిస్తే ఉమ్మడి పశ్చిమలో కేవలం రిజర్వుడు నియోజకవర్గాల మీదే జగన్ కసరత్తు సాగింది. చింతలపూడిలో సిట్టింగ్ ఎమ్మెల్యే ఎలీజాకు అమలాపురం ఎంపీ స్థానం ఆశపెట్టి చివరకు అది లేకుండా చేయడమే కాకుండా ఆయనకు ఇప్పటికీ చుక్కలు చూపిస్తూనే ఉన్నారు. హోంమంత్రి తానేటి వనితను కొవ్వూరు నుంచి గోపాలపురానికి ట్రాన్స్‌ఫర్ చేశారు. అక్కడున్న సిట్టింగ్ ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కొవ్వూరు పంపారు.



టీడీపీలో తేల్చాల్సింది కొన్నే

టీడీపీ, జనసేన బీజేపీ ఉమ్మడి కూటమిలో భాగంగా టీడీపీ ఇంకా దెందులూరులోనే అభ్యర్థిని తేల్చాల్సి ఉంది ఈ స్థానం నుంచి మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు ఛాన్స్ ఇస్తారని ఇప్పటికే ఆయన వర్గం ధీమాతో ఉంది. చింతమనేని సతీమణికి ఇస్తారని కొందరు విస్తృత ప్రచారం చేశారు. చింతమనేని మాత్రం దీన్ని తిప్పికొడుతూ తానే తిరిగి పోటీ చేయబోతున్నట్లు చాన్నాళ్ళ క్రితం బహిరంగంగా ప్రకటించారు. తెలుగుదేశం నాయకత్వం మాత్రం ఈ విషయంలో ఎలాంటి లీకేజీ లేకుండా ఇప్పటిదాకా జాగ్రత్తపడుతూ వచ్చింది . తుది జాబితాలో చింతమనేని ఖచ్చితంగా ఉంటారనేదానిపై సాగుతున్న చర్చలు ఒక కొలిక్కి రాబోతున్నాయి.

కాంగ్రెస్, కమ్యూనిస్టుల రూటెటు?

ఎన్నికల పొత్తులో భాగంగా కాంగ్రెస్, కమ్యూనిస్టుల తుది కసరత్తు సాగలేదు. ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానం పరిధిలోని 14 అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల విషయంపై ఏపీసీసీ బుధవారం సుదీర్ఘ కసరత్తు చేసింది. ఆయా నియోజకవర్గాల నుంచి ఆశావహుల నుంచి అందిన దరఖాస్తులను పీసీసీ ఇప్పటికే వడబోసి జాబితాను సిద్ధం చేసి ఏపీసీసీ ఆమోదానికి పంపినట్టు సమాచారం. ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించనున్నారు. కమ్యూనిస్టులు తాము పోటీ చేసే స్థానాల జాబితాను కాంగ్రెస్‌కు అందించాయి. దీనిపై ఇరుపార్టీల మధ్య తుది మంతనాలు సాగాల్సి వుంది.

జనసేనలో లైన్ క్లియర్


జనసేన బి-ఫాం అందుకున్న నాయకర్

నలుగురు అభ్యర్థులకు బి-ఫారమ్‌లు
మంగళగిరిలో పవన్ కల్యాణ్ వన్ టూ వన్ భేటీ

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో తెలుగుదేశం-జనసేన కూటమి అభ్యర్థులు దాదాపు ఖరారయ్యారు. ఇప్పటికే జిల్లాలో పోటీ చేసే నాలుగు నియోజక వర్గాల్లో అభ్యర్థులను తెలుగుదేశం ప్రకటించింది. మరో మూడు నియోజకవర్గాల్లో జనసేన పోటీ చేయనుంది. జనసేన నుంచి పోటీ చేసే అభ్యర్థులను ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఖరారు చేశారు. అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. మంగళగిరి పార్టీ కార్యాలయంలో బుధవారం పవన్ కల్యాణ్ జనసేన ఆశావహులతో వన్ టూ వన్ సమావేశం నిర్వహించారు. భీమవరం నుంచి అంజిబాబు, తాడేపల్లిగూడెం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్, నర్సాపురం ఇన్‌ఛార్జ్ నాయకర్‌లు పవన్ కల్యాణ్‌తో భేటీ అయ్యారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గం నుంచి పచ్చమట్ల ధర్మరాజు కూడా పవన్‌తో వన్ టూ వన్ సమావేశంలో పాల్గొన్నారు. వీరందరికీ జనసేన బిఫారమ్‌లను పవన్ కల్యాణ్ అందజేశారు. పూర్వ పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గంలో జనసేన నుంచి ఉమ్మడి అభ్యర్థిగా కందుల దుర్గేష్‌ను పవన్ కల్యాణ్ అధికారికంగా ప్రకటించారు. . తెలుగుదేశం పార్టీ నుంచి ఆచంటలో మాజీమంత్రి పితాని సత్యనారాయణ, పాలకొల్లులో సిట్టింగ్ ఎమ్మెల్యే నిమ్మల రామా నాయుడు, ఉండిలో సిట్టింగ్ ఎమ్మెల్యే రామరాజు, తణుకు నుంచి మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పోటీ పడుతున్నారు. భీమవరం నుంచి పవన్ కల్యాణ్ బరిలోకి దిగుతారని అంతా భావించారు. చివరికి భీమవరంలో పోటీ చేసే ప్రతిపాదనను పవన్ కల్యాణ్ విరమించుకున్నారు.అక్కడ మాజీ ఎమ్మెల్యే అంజిబాబుకు అవకాశం కల్పించారు. తాడేపల్లిగూడెంలో తొలినుంచి తెలుగుదేశం-జనసేనల పార్టీ మధ్య అభ్యర్థి ఎవరనే విషయమై తర్జన భర్జన సాగింది.చివరకు జనసేనకు ఇవ్వాలని నిర్ణయించారు. బీజేపీతో పొత్తు తర్వాత నాయకులు ఇక్కడ పోటీ చేయాలని ప్రయత్నాలు చేశారు. కేంద్ర స్థాయిలో పావులు కదిపారు. అయినా జనసేనకే కేటాయిస్తూ కూటమి నిర్ణయం తీసుకుంది.

ఉండి నుంచే పోటీ చేస్తా..

ఏ పార్టీ అన్నది త్వరలోనే ప్రకటిస్తా : మాజీ ఎమ్మెల్యే శివ

కాళ్ళ, మార్చి 13 : అభిమానులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు కోరిక మేరకు 2024 సాధారణ ఎన్నికల్లో ఉండి నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని ఉండి మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) అన్నారు.అయితే ఏ పార్టీ తరుపున పోటీ చేస్తానన్నది శనివారం తెలియజేస్తానన్నారు. భీమవరంలోని తన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2019 సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఉండి ఎమ్మెల్యేగా ఉన్న తాను ఆనాడు నర్సాపురం లోక్‌సభ సభ్యుడిగా పోటీ చేశానన్నారు. ఆ ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యానన్నారు. ఎమ్మెల్యేగా, పార్టీ నాయకుడిగా ఎంతో కష్టపడి పనిచేశానని, ఈ విషయం తెలిసి కూడా తెలుగుదేశం పార్టీ తనకు అభ్యర్థిత్వం కేటాయించలేకపోవడం పట్ల దిగ్భ్రాంతికి గురయ్యానన్నారు. నన్ను సంప్రదించకుండా ఉండి అభ్యర్థిగా వేరొకరిని ప్రకటించడం కలిచి వేసిందన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న శివ



సమీక్షలో పాల్గొన్న కలెక్టరు, ఎస్పీ, జేసీ

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ సుమిత్ కుమార్

భీమవరం, మార్చి 13 : సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే అమల్లోకి రానున్న ఎన్నికల ప్రవర్తనా నియమావళిని రాష్ట్ర వ్యాప్తంగా పటిష్టంగా అమలు చెయ్యాలన్నారు. త్వరలో ఎన్నికల షెడ్యూలు ప్రకటించనున్న నేపథ్యంలో అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ఎస్పీలు, సీపీలు కృషి చే యాలన్నారు. భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఎస్పీ అజిత వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జిల్లాలో అందిన ఫారం-6,7,8 దరఖాస్తులలో ఇంతవరకు మొత్తం 7617 పరిష్కరించామని, ఇంకా 3,916 దరఖాస్తులను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఫారం-6 దరఖాస్తులకు సంబంధించి 3,010 పరిష్కరించా మని,1470 దరఖాస్తులను పరిశీలిస్తున్నామన్నారు. ఫారం-7కు సంబంధించి 2,462 పరిష్కరించగా 1,493 దరఖాస్తులను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఫారం-8 దరఖాస్తులలో 2145 పరిష్కరించామని 953 దరఖాస్తులను పరిశీలిస్తున్నామని వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 84,324 ఓటరు కార్డులను పోస్టల్ ద్వారా పంపిణీ చేశామని, ఇంకా లక్షా పదివేల ఓటరు కార్డులను ముద్రిస్తామని తెలిపారు. జిల్లాలో ఎన్నికలకు సంబంధించి వార్తాపత్రికల్లో 87 వ్యతిరేక వార్తలు రాగా వాటిని ఈఆర్వోల ద్వారా విచారణ చేసి చర్యలు తీసుకున్నట్టు ఎన్నికల అధికారికి వివరించారు. జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య, సెబ్ జిల్లా అడిషనల్ ఎస్పీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టరుగా ప్రవీణ్ ఆదిత్య బాధ్యతలు



భీమవరం, మార్చి 13 : జిల్లా జాయింటు కలెక్టరుగా సీవీ ప్రవీణ్ ఆదిత్య బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. జేసీ ఛాంబర్‌లో సంతకం చేసి బాధ్యతలు చేపట్టారు. ఆర్డీవోలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, జేసీని కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

వసతులు లేకున్నా పన్నుల భారం..

ఇష్టానుసారంగా పన్నుల వసూళ్లు

గగ్గోలు పెడుతున్న ఆకివీడు చేపల మార్కెట్ వర్తకులు


ఆకివీడు చేపల మార్కెట్.. పనిచేస్తున్న మహిళలు



ఆకివీడు, మార్చి 13: ఆకివీడు లాంచీలరేవులోని హోల్‌సేల్ చేపల మార్కెట్‌కు ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక గుర్తింపు ఉంది. నగర పంచాయతీకీ ఏటా ఈ మార్కెట్ నుంచి రూ.50 లక్షలు ఆదాయం పైనే సమకూరుతుంది. అయితే మార్కెట్ ప్రాంతంలో తాగునీరు, మరుగుదొడ్ల తదితర సౌకర్యాలు కూడా లేకపోవడంతో రైతులు, మత్స్యకారులు, వ్యాపారులు, మహిళలు అవస్థలు పడుతున్నారు. అరవై ఏళ్ల క్రితం కొల్లేరులోని లంక గ్రామాలు (జంగంపాడు, కొట్టాడ, శింగరాలతోట, చింతపాడు, ఏలూరు) తదితర చోట్ల నుంచి మావులు, దోనెల ద్వారా వేటాడిన చేపలు లాంచీల ద్వారా లాంచీల రేవుకు తెల్లచేప, నాటు గురక, కొరమేను, ఇంగిలాయలు, బొమ్మిడేలు, రొయ్యలు తదితర చేపలను డబ్బాలతో వేటగాళ్ళు తీసుకొచ్చేవారు. ఆ చేపలను ఇక్కడ ఉండే ముస్లిం వర్తకులు కొనుగోలు చేసి లారీల ద్వారా హౌరాకు పంపించి అమ్ముకొనేవారు. 1981 నుంచి ఆక్వా కల్చర్ ప్రారంభం అవ్వడం, చెరువులు పెరగడంతో లాంచీల రేవు దగ్గర చేపల కాటాలు మొదలయ్యాయి. రానురాను వ్యవసాయం తగ్గి చేపలు, రొయ్యల సాగు అధికమైంది. గతంలో కొల్లేరులో పట్టిన వాటినే రేవుకు తీసుకొచ్చేవారు. చేపలు, రొయ్యలు చెరువుల్లో సాగు పెరగడంతో లాంచీలరేవు దగ్గర రోజుకి సుమారు 50 టన్నులు పైనే చేపలు, 3 టన్నులు రొయ్యలు, 5 టన్నులు నల్లచేపలు తరలి వస్తున్నాయి. వర్తకులు కొనుగోలు చేసిన వాటిని రైళ్లలో మహరాష్ట్ర, గుజరాత్, ఒడిశా, చత్తీస్‌గఢ్, కర్నాటక, తమిళనాడు, కేరళ, అస్సాం, ఢిల్లీ, యూపీ, ఎంపీ, తెలంగాణ, వెస్ట్ బెంగాల్‌కు ఎగుమతి చేస్తున్నారు. అంతే కాకుండా నెలకు సుమారు 60 లారీల సరుకు ఇతర రాష్ట్రాలకు తరలుతుంది. రోజుకు రూ.50లక్షల అమ్మకాలు జరుగుతాయి. మహిళలు, వర్తకులు, ప్యాకింగ్, ముఠాలు, లేబర్, రిక్షా తదితర కార్మికులు 3 వేల పైబడి జీవనోపాధి పొందుతున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ చేపలు, రొయ్యలు వలిచే పనిలో మహిళల ఉంటారు. చేపైనా, రొయ్యలైనా కేజీకి రూ.20 తీసుకుంటారు. ఇళ్ల దగ్గర మహిళలు ఈ పని చేయకపోవడంతో ఇక్కడ మహిళలకు జీవనోపాధి పుష్కలంగా ఉంటుంది.

వసతులు కల్పించే వరకూ పన్నులు చెల్లించం



మార్కెట్‌లో మౌలిక వసతులు కల్పించే వరకూ పన్నులు చెల్లించం. ఇటీవల జరిగిన మార్కెట్ వేలం పాటలు పెంచడంతో ఆశీలు అత్యధికంగా వసూలు చేస్తున్నారు. దీంతో ఆక్వా రైతులు, వ్యాపారులు నష్టపోతున్నారు. అంతేకాకుండా ప్రతీ ఆదివారం మార్కెట్టుకు సెలవు ప్రకటిస్తున్నాం. అధికారులు పన్నుల వసూళ్ల బోర్డులు ఏర్పాటుచేసి పాటదారులు నిబంధనలు పాటించేలా చూడాలి.

-షేక్ సుభానీ, భక్తాంజనేయ చేపల వర్తక కమిషన్ సంఘం అధ్యక్షుడు, ఆకివీడు

చర్యలు తీసుకుంటాం



చేపల మార్కెట్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం.పూర్తి స్థాయిలో వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా పన్నులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. గజిల్ ప్రకారం వేలం పాటలు నిర్వహించారు. బోర్డులు ఏర్పాటు చేస్తాం.

-జి.కృష్ణమోహన్, కమిషనర్, ఆకివీడు



ఆచంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పడిగాపులు కాస్తున్న కక్షిదారులు

పరిష్కారం లేదా ?

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో తరచూ సర్వర్ డౌన్

అసహనం వ్యక్తం చేస్తున్న కక్షిదారులు

ఆచంట, మార్చి 13: రిజిస్ట్రేషన్ శాఖ కొత్తగా తీసుకువచ్చిన 2.0 విధానంతో ప్రతీ రోజూ ఏదో ఒక సమస్య తలెత్తుతూనే ఉంటుంది. రిజిస్ట్రేషన్‌లు సజావుగా సులువుగా జరగడానికి వీలు లేకుండా ఆటంకాలు కలుగుతూనే ఉన్నాయి. దీంతో కక్షిదారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద గంటలు కొద్దీ వేచి ఉన్నప్పటికి తరచూ సర్వర్ సమస్య వస్తుండటంతో కక్షిదారులు చివరకు నిరాశతో వెనుతిరుగుతున్నారు. బుధవారం రిజిస్ట్రేషన్ విషయంలో సర్వర్ సరిగ్గా పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్‌లు జిల్లా వ్యాప్తంగా అంతంత మాత్రంగానే జరిగినట్లు సమాచారం. ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్‌లు ద్వారా ప్రతీరోజూ కోట్ల రూపాయలు ఆదాయం వస్తున్న సంబంధిత శాఖ అధికారులు సరిగ్గా పట్టించుకోకపోవడం దారుణమని కక్షిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ సంబంధించి చలానా రూపంలో ప్రభుత్వానికి డబ్బులు కడుతున్నామని ఆ డబ్బులు వెంటనే ప్రభుత్వ ఖజానాకు వెళ్లిపోతు న్నాయన్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్‌ల విషయంలో అనేక నిబంధనలు పెట్టిన కారణంగానే కక్షిదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి సర్వర్ సమస్య లేకుండా చూసి రిజిస్ట్రేషన్‌లు సజావుగా అయ్యేటట్లు చూడాలని కోరుతున్నారు.

పీఎం సూరజ్ పోర్టల్ ప్రారంభం

ఏలూరు కలెక్టరేట్, మార్చి 13 : కేంద్ర ప్రభుత్వం నిరుపేదలకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగించుకోవాలని జేసీ బి.లావణ్యవేణి సూచించారు. పీఎం సూరజ్ జాతీయ పోర్టల్‌ను బుధవారం ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి జేసీ, అధికారులు లబ్ధిదారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ పీఎం సూరజ్ పోర్టల్ ద్వారా బడుగు, బలహీన వర్గాల వారు ఆర్థికాభివృద్ధికి లక్ష రూపాయలు రుణ సదుపాయానికి దరఖాస్తు చేసుకోవచ్చ న్నారు. సఫాయికర్మ చార్యు లకు పీపీఈ కిట్లు, మహిళలకు శ్రీనిధిపథకం రుణాలు అందజేశారు. న్యూఢిల్లీకి చెందిన జాతీయ షెడ్యూల్ కులాల ఆర్థికాభివృద్ధి కార్పొరేషన్ జీఎం కె.డేవిడ్, డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు, కమిషనర్ వెంకటకృష్ణ పాల్గొన్నారు.


16 రోజులు.. రూ.1.25 కోట్లు



చినవెంకన్న హుండీల ఆదాయం

ద్వారకాతిరుమల, మార్చి 13 : ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామికి గడచిన 16 రోజులకు గాను హుండీల ద్వారా రూ.1.25 కోట్లు భారీ ఆదాయం సమకూరింది. ప్రమోద కల్యాణ మండప ఆవరణలో బుధవారం కట్టు దిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ హుండీల లెక్కింపును నిర్వహించారు. హుండీల ద్వారా లభించిన రూ.1,25, 42,973 నగదు, 97 గ్రాముల బంగారం, 2.695 కేజీల వెండి, రద్దయిన పాతనోట్లు రూ.500 (7), 1000 (1), 2000 (20)తో పాటు విదేశీ కరెన్సీ వచ్చినట్టు ఈవో త్రినాథరావు తెలిపారు.

మసాజ్ సెంటర్లలో పోలీస్ తనిఖీలు



7

చల్ల..చల్లగా..
పుచ్చకాయలో పుష్కలంగా పోషకాలు



మరో 62 మంది వైద్య ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ఉత్తర్వుల జారీ

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఇప్పటివరకు 247మందికి రెగ్యులరైజేషన్.. మరో 23 మందికి పెండింగ్

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 13 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణ ప్రక్రియలో తాజాగా మరో 62 మంది పలు కేడర్ల ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఉమ్మడి జిల్లాలో ఇటీవలే 185 మంది ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. తాజాగా విడుదలైన జీవోలు 40, 41లలో జిల్లాకు సంబంధించి ఎంపీహెచ్‌ఏ(మేల్) 34మంది, ల్యాబ్ టెక్నీషియన్లు 11మంది, ఫార్మాసిస్టులు నలుగురు, ఆప్తాల్మిక్ అసిస్టెంట్లు ఇద్దరు, ఏఎన్‌ఎం/ఎంపీహెచ్‌ఏ(ఫీమేల్) 11మంది సర్వీసుల క్రమబద్ధీకరణకు అనుమతి లభించింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం అన్నికేడర్లు కలిపి మొత్తం 270 మంది ఉద్యోగులతోకూడిన జాబితాను ప్రభుత్వానికి పంపించారు. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టరేట్‌లో ఈ జాబితాలను పరిశీలించి విడతల వారీగా క్రమబద్ధీకరణకు ఉత్తర్వులు జారీచేస్తున్నారు. తాజా ఉత్తర్వులతో ఇప్పటివరకు రెండు విడతల్లో మొత్తం 247 మందికి క్రమబద్ధీకరణ లభించినట్టయింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో ఇంకా రెగ్యులరైజేషన్ ప్రతిపాదనల్లో మిగిలివున్న ఎంపీహెచ్‌ఏ(మేల్)14మంది, ల్యాబ్ టెక్నీషియన్లు ఇద్దరు, ఫార్మసిస్టు ఒకరు, ఏఎన్‌ఎంలు ఆరుగురు కలిపి మొత్తం 23మందికి సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులు శుక్రవారం నాటికి జారీ అయ్యే అవకాశం ఉందని డీఎంహెచ్‌వో కార్యాలయవర్గాలు తెలిపాయి. బుధవారం ఉత్తర్వులు జారీఅయిన ఉద్యోగులకు గురువారం ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం రెగ్యులరైజేషన్ ఆర్డర్లను అందజేయనున్నారు.

నానో టెక్నాలజీపై ఒకరోజు జాతీయ సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ పద్మారావు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 13: నానో టెక్నాలజీ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఉత్తేజపరిచే విధానం రోజు రోజుకు సాంకేతిక విధానంతో మరింత నైపుణ్యత, మెలకువలు పెరుగుతున్నాయని ఏపీ ట్రిపుల్ ఐటీ మాజీ డైరెక్టర్ జి. భగవన్నారాయణ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో బుధవారం ఆచార్య నన్నయ విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నానో టెక్నాలజీపై ఒకరోజు జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నన్నయ విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ కె.పద్మారావు మాట్లాడుతూ సంక్లిష్ట మైన సామాజిక సవాళ్లను పరిష్కరించడంలో ఆవిష్కరణలను నడపడంలో ఇంటర్ డిసిప్లనరీ పరిశోధన ప్రాముఖ్యతలను వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జి.సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

సెమీ కండక్టర్ల తయారీ హబ్‌గా భారత్


కార్యక్రమంలో విద్యార్థులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న డాక్టర్ నాగసీతారాం

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 13 : సెమీ కండక్టర్ల తయారీ విభాగంలో భారతదేశం స్వయం సమృద్ధి సాధించే దిశగా అడుగులు వేస్తుందని హైదరాబాద్ బిట్ సిలికా మేనేజర్ డాక్టర్ ఎం.నాగసీతారాం అన్నారు. ఏపీ నిట్‌లో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని 'సెమీ కండక్టర్ పరిశ్రమల్లో ఉన్న అవకాశాలు, సవాళ్ళు' అనే అంశంపై బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధికి పెట్టుబడులే కీలకమన్నారు. సెమీ కండక్టర్ల ఉత్పత్తికి సంబంధించిన పరిశ్రమలు భారతదేశంలో తగినన్ని లేకపోవడంతో ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుందన్నారు. దేశంలో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు పలు కంపెనీలు ముందుకు వస్తున్నాయని, భవిష్యత్‌లో భారత్ సెమీ కండక్టర్ల తయారీ హబ్‌గా నిలవనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తొలుత ప్రధాని మోదీ గుజరాత్, అస్సాం రాష్ట్రాలలో ప్రారంభించిన ఇండియా సెమీ కండక్టర్ మిషన్ కార్యకమాన్ని వర్చువల్ పద్ధతిలో తిలకించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్‌లు జీఆర్ కె.శాస్త్రి, టి.కురుమయ్య, ఎన్.జయరాం, జీబీవీరేష్‌కుమార్, ఆచార్యులు వి.సందీప్, శ్రీఫణికృష్ణ, యువరాజు, కిరణ్‌కుమార్, హిమబిందు పాల్గొన్నారు.

మసాజ్ సెంటర్లలో పోలీస్ తనిఖీలు


మసాజ్ సెంటరును తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, మార్చి 13 : ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లాలోని ఏలూరు, నూజివీడు నగరాల్లో ఆకస్మికంగా మసాజ్ సెంటర్లపై పోలీసు అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేశారు. విజయవాడలో ఈనెల 12వ తేదీన ఆకస్మికంగా మసాజ్ సెంటర్లపై పోలీసులు తనిఖీలు చేయగా అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. మసాజ్ పేరుతో క్రాస్ మసాజ్‌లు చేయడం, వ్యభిచారం నిర్వహించడం వంటి విషయాలు వెలుగులోకి రావడంతో పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నూజివీడు, ఏలూరు నగరాల్లో ఉన్న మసాజ్ సెంట ర్లపై బుధవారం సాయంత్రం తనిఖీలు చేశారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే సహించేది లేదని ఎక్కడైనా మసాజ్ సెంటర్లలో జరుగుతున్నట్టు సమాచారాన్ని 100, 112 లేదా పోలీస్ కంట్రోల్ నంబర్ 83329 59175కు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. ఏలూరు నగరంలో జరిగిన దాడుల్లో త్రీటౌన్ సీఐ వెంకటేశ్వరరావు, టూటౌన్ సీఐ ప్రభాకర్ పలువురు ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ముగ్గురు విద్యార్థినుల అదృశ్యం

ఆగిరిపల్లి, మార్చి 13: ఆగిరిపల్లి మండలం నూరవరం గ్రామంలోని జడ్పీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు బుధవారం పాఠశాలకు వెళ్లి కనబడకుండా పోయారు. స్కూల్ విడిచిన తరువాత ఇళ్లకు రాలేదని వారి తల్లిదండ్రులు ఆగిరిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయం 8.30 నిమిషాలకు స్కూల్‌కి వెళ్లిన పిల్లలు తిరిగి రాకపోడంతో స్కూల్‌లో వాకబ్ చేస్తే పిల్లలు పాఠశాలకు రాలేదని తెలిసిందన్నారు. దీనిపై ఎస్‌ఐ సురేంద్రకుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96444 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

భీమవరంలో ఇరువర్గాల ఘర్షణ !

ఓ కేసుకు సంబంధించి పెంటపాడు పోలీసులు వచ్చారని సీఐ స్పష్టం

భీమవరం క్రైం, మార్చి 13 : భీమవరం పాతబస్టాండ్‌లో ఇరువర్గాల ఘర్షణతో ఆ ప్రాంతం హడలెత్తింది. బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటన కిడ్నాపా, ఇరువర్గాల ఘర్షణో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. సమాచారం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లేసరికి ఎటువంటి ఘర్షణ వాతావరణం లేదని.. ఓ కేసుకు సంబంధించి విచారణ నిమిత్తం కొంతమందిని తీసుకెళ్లేందుకు పెంటపాడు పోలీసులు వచ్చారని సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాలివి.. నీళ్ల తోడే మోటార్లను కొందరు దొంగిలించారని, వాళ్లల్లో కొందరిని పెంటపాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎవరికి విక్రయించారో, ఆ మోటార్లు ఎక్కడ ఉన్నాయో విచారణలో భాగంగా భీమవరం వచ్చారు. ఆరు నెలల క్రితం కొనుగోలు చేసినట్టు చెబుతున్న వ్యక్తిని కారులోకి ఎక్కించుకుని వెళ్లారు. ఈ నేపథ్యంలో మీరెవరో తెలియకుండా ఏవిధంగా పెంటపాడు స్టేషన్‌కు వస్తామని సదరు వ్యక్తితో పాటు మరికొందరు పోలీసులను ప్రశ్నించగా కారులో వచ్చినవాళ్ళు పోలీసులమన్నారు. గుర్తింపు కార్డులు చూపాలని పోలీసులను ప్రశ్నించడంతో పోలీసులనే గుర్తింపు కార్డులు అడుగుతారా అంటూ అక్కడున్న వారిని కారులోకి ఎక్కించుకుని వెళ్లారు. అపహరణకు గురైన మోటార్ల విలువ రూ.10లక్షలు ఉంటుందని దీని నిమిత్తం విచారణ నేపథ్యంలో వివాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

పట్టుబడిన లిక్కర్ ధ్వంసం



నూజివీడు టౌన్, మార్చి 13: నూజివీడు సెబ్ స్టేషన్‌ను ఏలూరు సెబ్ సూపరింటెండెంట్ కె.రామకృష్ణ బుధవారం సందర్శించారు. సిబ్బందితో నేరాలను తగ్గించే విధానాలపై చర్చించారు. అనంతరం గత ఏడాది డిసెంబరు నుంచి ఈ ఏడాది జనవరి నెలాఖరు వరకు వివిధ కేసుల్లో పట్టుబడిన 383 లీటర్ల సారా, 581 మద్యం సీసాలను ఆయన ధ్వంసం చేశారు. నూజివీడు సెబ్ సీఐ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ ఇదేనా ?

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో యథేచ్ఛగా శునకాలు, పందులు

- జంతువులు రాకుండా ఉండేందుకు రూ. మూడు లక్షలు కాంట్రాక్టు
- నెలనెలా బిల్లుల చెల్లింపు.. కానరాని ఆ విభాగం ఉద్యోగులు
- చెదలు పడుతున్నా.. పట్టించుకోని సంబంధిత కాంట్రాక్టర్లు


ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో వున్న పందులు


చెదలు పట్టిన తలుపు


ఆసుపత్రి లోపల ఉన్న శునకం


ఎంసీహెచ్ బ్లాక్ వద్ద తిరుగుతున్న శునకాలు

ఏలూరు క్రైం, మార్చి 13 : ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే కాదు. వారికి దోమలు, చీమల నుంచి కూడా రక్షణ కల్పించాలని టీడీపీ ప్రభుత్వం అప్పట్లో చర్యలు తీసుకుంది. అంతేకాకుండా మార్చురీలో ఉన్న మృత దేహాలను ఎలుకలు, పంది కొక్కులు, కుక్కలు పీక్కుతింటున్నాయని అక్కడ కూడా రక్షణ కల్పించాలని నిర్ణయించి ఏకంగా నెలకు లక్షలాది రూపాయలను వెచ్చిస్తుంది. జిల్లా కేంద్రమైన ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఒక మృతదేహం నేత్రాలను ఎలుకలు పీక్కుతినేయడం, గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చీమలు ఒక పసిబిడ్డ మృతదేహాన్ని తినేయడం జరిగిన ఘటనలపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రభుత్వాసుపత్రిలో కుక్కలు, పందులు, ఎలుకలు, చీమలు, బొద్దింకలు, బల్లులు, దోమలు, ఈగలు లేకుండా చేయడానికి నెలకు లక్షలాది రూపాయలను థర్డ్‌పార్టీ కాంట్రాక్టర్‌కు అన్ని ఆసుపత్రులలో పనులను అప్పగించి చెల్లిస్తున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఈ కాంట్రాక్టరు సొమ్ములు తీసుకోవడం తప్పితే ఎలాంటి జాగ్రత్త చర్యలు తీసుకోవడం లేదని స్పష్టంగా కనిపిస్తుంది. ముఖ్యంగా ప్రభుత్వా సుపత్రి ఆవరణ నిండా శునకాలు, పందులు తిరుగుతూనే ఉన్నాయి. వాటి సంతానాన్ని ఆసుపత్రి ఆవరణలో అభివృద్ధి చేసుకుని ఆవాసాలుగా మార్చుకున్నాయి. ఇక దోమలు, ఈగలు చెప్పనక్కరలేదు. వీటన్నింటిని నిర్మూలించడానికి రసాయనాలను పిచికారీ చేయాల్సి ఉంటుంది, కానీ ఎక్కడా ఇలాంటివి జరిగిన దాఖలాలు కనిపించడంలేదు. నెలవారీ చూస్తే మూడు లక్షల రూపాయల పైబడి బిల్లులు అధికారులు చెల్లించడం గమనార్హం.

వార్డుల్లోనూ తిరుగుతున్న కుక్కలు

ఆసుపత్రి ఆవరణలోనే కాకుండా వార్డుల్లో కూడా కుక్కలు స్వేచ్ఛగా తిరుగుతూ తమ ఆవాసాలుగా మార్చేసుకుంటున్నాయి. ఆసుపత్రికి రోగాలు పోగొట్టుకోవడానికి వచ్చే రోగులకు వీటి వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు కనిపిస్తున్నాయి. కుక్కలు ఆసుపత్రిలో తిరుగుతుండడంతో ఆసుపత్రికి వచ్చే వారు భయభ్రాంతులకు గురవుతున్నాయి. తల్లీబిడ్డల వైద్యసేవల విభాగం వద్ద కుక్కలు ఎక్కువగా తిరగడం వల్ల వచ్చే బాలింతలు, గర్భిణులు భయభ్రాంతులకు గురవుతున్నారు. మార్చురీ వద్ద పరిస్థితి దుర్భరంగా ఉంది.

చీకటిపడితే దోమల విజృంభణ

చీకటి పడిందంటే రోగులు దోమల నిర్మూలనకు అగరబత్తీలను, పలు రకాల క్వాయిల్స్‌ను, మస్కిటో బ్యాట్‌లను వినియోగించాల్సి వస్తుంది. ఒక్క రోజు కూడా దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేసినట్టు లేనేలేదు. చెదలు లేకుండా రసాయనాలు పిచికారీ చేయాల్సి ఉన్నా పట్టించుకోకపోవడంతో తలుపులు, గుమ్మాలను కూడా తినేస్తూనే ఉన్నాయి. అయితే ఎవరూ పట్టించుకోకపోవడం దారుణమైన పరిస్థితి. అసలు ఆ విభాగానికి సంబంధించిన ఉద్యోగులు ఎవరు, ఎక్కడ పనిచేస్తున్నారో తెలియని పరిస్థితి. కానీ అధికారులు మాత్రం నెలావారీ బిల్లులు చెల్లించడం వెనుక అంతర్యం ఏమిటో తెలియాల్సి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆసుపత్రికి వచ్చే పలువురు కోరుతున్నారు.

క్రైం సమాచారం

వృద్ధురాలిపై ఏసీ మెకానిక్ దాడి..

14 కాసుల బంగారంతో ఉడాయింపు.. పరిమెళ్లలో ఘటన


గాయపడిన వృద్ధురాలు

పెంటపాడు, మార్చి 13 : ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై దాడి చేసి ఆమె ఒంటిపై ఉన్న 14 కాసుల బంగారాన్ని అపహరించుకుపోయిన ఘటన బుధవారం పరిమెళ్ళ గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. గ్రామంలో పెనుమత్స వెంకట సూర్యాకాంతం(80) అనే వృద్ధురాలు నివాసం ఉంటుంది. ఆమెకు పిల్లలు లేరు. భర్త కూడా మృతి చెందడంతో ఒంటరిగానే జీవిస్తుంది. ఆదే గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి ఏసీ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఒంటరిగా జీవిస్తున్న ఆమె బంగారంపై అతడి కన్నుపడింది. రెండు రోజులుగా ఆమె ఇంటి వద్దే రెక్కీ నిర్వహించాడు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో వీధిలో ఎవరూ లేకపోవడం చూసి వృద్ధురాలి గృహంలో ప్రవేశించాడు. ఆమె ఎందుకు వచ్చావంటూ ప్రశ్నించడంతో ఏసీ ఎలా పనిచేస్తుందో తెలుసుకునేందుకు వచ్చానని నమ్మబలికి వృద్ధురాలిపై దాడి చేసి విచక్షణారహితంగా కొట్టాడు. వృద్ధురాలు స్పృహ తప్పడంతో ఆమె ఒంటిపై ఉన్న సుమారు 14 కాసుల బంగారం పట్టుకుని ఉడాయించాడు. అనంతరం విషయం తెలుసుకున్న చుట్టుపక్కల స్థానికు ఆమె ఇంటి వద్దకు చేరుకున్నారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రస్తుతం బాధితురాలు తాడేపల్లిగూడెంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది.

విద్యుదాఘాతంతో మోటారు మెకానిక్ మృతి

పెదవేగి, మార్చి 13 : పెదవేగి మండలం కూచింపూడి గ్రామానికి చెందిన దేవరపల్లి ఆంజనేయులు (40) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలివి.. దేవరపల్లి ఆంజనేయులు మోటారు మెకానిక్ పనులు చేస్తుంటాడు. బుధవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంటి దగ్గర విద్యుత్ మోటారు పనులు చేస్తుండగా మోటారుకు విద్యుత్ ప్రవహించడంతో షాక్‌కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఏలూరు తరలించగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందిందని, వివరాలు తెలియాల్సి ఉందని పెదవేగి ఎస్‌ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. ఇద్దరు కూలీలకు గాయాలు


ముసునూరులో పల్టీ కొట్టిన ట్రాక్టర్

ముసునూరు, మార్చి 13: పొగాకు దుత్తల లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్ ముసునూరు మసీదు సమీపంలో ఉన్న మలుపు వద్ద ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు కూలీలకు గాయాలయ్యాయి. చాట్రాయి మండలం మర్లపాలెం గ్రామానికి చెందిన ట్రాక్టర్ బుధవారం ఉదయం దెందులూరు మండలం కొప్పాకలో పొగాకు దుత్తలు లోడ్ చేసుకుని తిరిగి మర్లపాలెం వెళుతోంది. ఈ క్రమంలో ముసునూరు మసీదు పక్కన మలుపు తిరుగుతుండగా ఎదురుగా వచ్చిన టాటా ఏస్ వాహనాన్ని తప్పించే క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పల్టీ కొట్టింది. ట్రాక్టర్ ఇంజన్‌పై ఉన్న ఆరుగురు కూలీల్లో ఇద్దరు గాయపడగా వారికి ముసునూరు పీహెచ్‌సీలో చికిత్స అందించారు.

ఐదుగురు బైక్ దొంగల అరెస్ట్

రూ.30 లక్షల విలువైన 25 మోటారు సైకిళ్లు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఉంగుటూరు, మార్చి 13 : వ్యసనాలకు బానిసలైన యువకులు కొత్త మోటారు సైకిళ్లను దొంగతనం చేసి దాచిన నేరంపై చేబ్రోలు పోలీసులు ఐదుగురు యువకులను అరెస్టు చేశామని ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం చేబ్రోలు పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.30లక్షల విలువైన 25 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కైకరం గ్రామానికి చెందిన దొడ్డి లక్ష్మీనారాయణ, చిటికిన పవన్‌కుమార్, భీమడోలు మండలం పూళ్ల గ్రామానికి చెందిన చిట్టాబత్తుల కార్తీక్ , ఉంగుటూరు మండలం నారాయణపురానికి చెందిన పంతగాని లోకేష్, పిండ్రాల నాగులు... కైకరం నుంచి రెండు నంబర్లు లేని బైక్‌లపై వస్తుండగా పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించి 25 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరంతా పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, విశాఖ జిల్లాల్లోని వేర్వేరు పోలీసుస్టేషన్ల పరిధిలో నేరాలు చేసినట్టు వెల్లడించారు. ఈ మేరు నిడమర్రు సీఐ మోగంటి వెంకటసుబాష్, చేబ్రోలు, నిడమర్రు, గణపవరం ఎస్‌ఐలు ఎ.మణికుమార్, ఆర్.శ్రీను, వెంకటేశ్వరరావు, సిబ్బందిని అభినందించి నగదు బహుమతిని అందించారు.

చెత్తకుండీలో నవజాత శిశువు


చెత్తకుండీ వద్ద వున్న శిశువు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 13: తాడేపల్లిగూడెంలో అమానుష ఘటన వెలుగు చూసింది. అప్పుడే పుట్టిన ఆడబిడ్డ మృతదేహం చెత్తకుం డీలో బుధవారం ఉదయం దర్శనమిచ్చింది. పారిశుధ్య కార్మికులు చెత్త శుభ్రం చేసే క్రమంలో ఆ పసికందు మృతదేహం బయట పడింది. తాడేపల్లిగూడెం పట్టణ పోలీసులు, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు.

ఉద్యోగం ఆశ చూపి మోసం

ముసునూరు, మార్చి 13: ఉద్యోగం ఆశ చూపి రెండు లక్షల రూపాయలు తీసుకుని యువతిని మోసం చేసిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్టు ముసునూరు ఎస్‌ఐ పి.వాసు తెలిపారు. ముసునూరు గ్రామానికి చెందిన దాసిరెడ్డి బాలస్వాతి 2020-22 సంవత్సరంలో బైపీసీ గ్రూప్ తీసుకుని ఇంటర్ పూర్తిచేసింది. అయితే యువతి తండ్రి దాసిరెడ్డి నాగు సైకిల్, బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ముసునూరు మండలం చిల్లబోయినపల్లికి చెందిన గద్దల ఆశీర్వాదం అనే వ్యక్తి, యువతి తండ్రితో పరిచయం పెంచుకున్నాడు. నీట్ పరీక్ష రాయకుండా, పంజాబ్ జీఎన్‌ఏ యూనివర్సిటీలో బీఎస్సీ ఎనస్తీషియా (మత్తు మందు) కోర్సుకు సంబంధించిన సీటుతోపాటు విదేశాల్లో ఉద్యోగం కూడా ఇప్పిస్తానని యువతికి, ఆమె తండ్రికి ఆశీర్వాదం ఆశచూపి 2023 డిసెంబరు నెలలో రూ. 2లక్షల నగదును తీసుకున్నాడు. నాటి నుంచి మాయమాటలు చెబుతూ కాలం వెళ్ళదీస్తున్నాడే తప్ప తీసుకున్న నగదు ఇవ్వకపోవడం లేదు. దీంతో యువతి బాలస్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



బేతపూడిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

భీమవరంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

ఓటు హక్కుపై ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకే : పోలీస్ అధికారులు

భీమవరం క్రైం, మార్చి 13 :ప్రశాంత వాతావరణంలో రాబోయే సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు చేపడుతున్న ముందస్తు చర్యల్లో భాగంగా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకే కేంద్ర పోలీస్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ పట్టణంలో నిర్వహించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు భీమవరం అసెంబ్లీ నియోజకవర్గం, భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల కొత్తపూసలమర్రు, దొంగపిండి, తాడేరు, బేతపూడి, ఆచంట అసెంబ్లీ నియోజకవర్గం, పోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల గ్రామాల పరిధిలో ఫ్లాగ్‌మార్చ్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ అధైర్యపడకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌శాఖ సంసిద్ధంగా ఉందన్నారు. ఈ మార్చ్‌లో భీమవరం రూరల్ సీఐ వై.సత్యకిషోర్, ఎస్‌ఐ బి.రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డబుల్, ట్రిపుల్ ఎంట్రీలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

భీమవరం, మార్చి 13 : భీమవరం నియోజకవర్గంలోని ఓటరు జాబితాలో ఓటు డబుల్, ట్రిపుల్ ఎంట్రీలు నమోదైనందున వాటికి సంబంధించిన డేటాను జిల్లా కలెక్టర్‌కు అందజేసి వెంటనే ఆయా ఓట్లను తొలగించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు వినతి పత్రం అందించారు. ఇప్పటివరకు పరిశీలన చేయగా సుమారు 280 ఓట్లు డబుల్, ట్రిపుల్ ఎంట్రీలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమల్ల చంద్రశేఖర్, పట్టణ ప్రధాన కార్యదర్శి సుంకర రవి, వానపల్లి సూరిబాబు, రామాయణం శ్రీనివాస్, జూలూరి వెంకటేష్ ఉన్నారు.

రేవు పాట రోజుకు రూ.1.05 లక్షల వసూలు !

- నెలాఖరుతో ముగుస్తున్న పాటదారుడి గడువు
- ఎన్నికల కోడ్ ముగిసిన తరువాతే రేవు పాటకు జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయం


గోదావరిలో పంటు

నరసాపురం, మార్చి 13: మాధవాయిపాలెం రేవు పాట అనూహ్యంగా మలుపు తిరిగింది. షెడ్యూల్ ప్రకారం ఈనెలలో టెండర్ నోటీస్ జారీ చేసి పాటను నిర్వహించాల్సి ఉంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తున్నందున పాటను కోడ్ ముగిసిన తరువాతే నిర్వహించాలని జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయించింది. ఎంపీపీ సోని ఆధ్యక్షతన జాయింట్ యాక్షన్ కమిటీ అత్యవసరంగా సమావేశమై ఈనిర్ణయం తీసుకుంది. అప్పటి వరకు ప్రస్తుత పాటదారుడినే కొనసాగించాలని, రోజుకు రూ.1.05లక్షల చొప్పున వసూలు చేయాలని నిర్ణయించారు. దీన్ని జిల్లా అధికారులు ఆమోదించాల్సి ఉంది. ప్రస్తుతం పాటదారుడు నిర్వహణ ఈనెలాఖరుతో ముగుస్తుంది. గత ఏడాది పాటలో రూ.3.66 కోట్లకు పాటను దక్కించుకున్నాడు. ఇప్పటివరకు పాటదారుడు మొత్తం చెల్లిస్తూ వచ్చారు. ఇంకా రూ.20 లక్షలు కట్టాల్సి ఉంది. అతడి డిపాజిట్ రూ 21.72 లక్షలు ఉంది. ఉన్న బాకీ కూడా నెలాఖరు లోపు క్లియర్ చేస్తే అతడికి రేవు నిర్వహణ బాధ్యతల్ని అప్పగిస్తామని ఎంపీడీవో రమణరావు తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి రోజువారీగా వసూలు చేస్తామన్నారు. కోడ్ ముగియగానే పాటను నిర్వహించే విధంగా ప్లాన్ చేశామన్నారు. దీనికి జిల్లా యంత్రాంగం నుంచి అనుమతి రావాల్సి ఉందన్నారు.

చల్ల..చల్లగా..

నోరూరిస్తున్న పుచ్చకాయలు




- కాయ సైజును బట్టి రూ.50-150 వరకు
- తమిళనాడు నుంచి దిగుమతి చేస్తున్న వ్యాపారులు
- ఆరోగ్యానికి మంచిదంటున్న వైద్యులు


పుచ్చకాయలు

గణపవరం, మార్చి 13: వేసవి ఎండలు పెరగడంతో పుచ్చకాయల అమ్మకాలు ఊపందుకున్నాయి. ఈ ఏడాది మార్చి నెల మొదటివారంలోనే పుచ్చకాయలు మార్కెట్‌లో విరివిగా లభిస్తున్నాయి. వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు మక్కువ చూపుతున్నారు. చలితీవ్రత పూర్తిగా తగ్గి ఎండ తీవ్రత పెరడంతో ప్రజలు చల్లని పానీయాలకంటే పుచ్చకాయల వైపే మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా పుచ్చకాయల్లో పోషకాలు, కాల్షియం, పిండి పదార్థాలు అధికంగా ఉంటాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పంట వచ్చేందుకు ఇంకా సమయం ఉండడంతో స్థానిక వ్యాపారులు తమిళనాడు రాష్ట్రం నుంచి పుచ్చకాయలు దిగుమతి చేసుకుంటున్నారు. టన్నుకు రూ.18వేలు, రవాణా ఖర్చులతో కలిపి సుమారు రూ.22 వేలకుపైగా అవుతుందని వ్యాపారులు చెబుతున్నారు. కిలో రూ.40 - 45 వరకు, సైజును బట్టి ఒక కాయ రూ.50-150 వరకు విక్రయిస్తున్నారు. ముఖ్యంగా భీమవరం, తాడేపల్లిగూడెం, ఏలూరు రహదారుల వెంబడి ఈ పుచ్చకాయల విక్రయాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా గణపవరం బొబ్బిలి వంతెన వద్ద పుచ్చకాయల విక్రయాలు నిర్వహిస్తుండగా యువకులు తోపుడు బళ్ళ మీద, ఆటోలపైన గ్రామాల్లో విక్రయాలు చేస్తున్నారు. ఈ సీజన్ నాలుగు నెలల పాటు అనేక మందికి ఈ పుచ్చకాయల వ్యాపారం జీవనోపాధికి ఎంతగానో దోహదపడుతుందని వ్యాపారులు చెబుతున్నారు. ఎండలు పూర్తిగా ముదరకుండానే పుచ్చకాయల ధరలు ఇంత పలుకుతుంటే ఎండలు పెరిగాక ఏ స్థాయిలో ధరలు ఉంటాయోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పుష్కలంగా పోషకాలు

పుచ్చకాయల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. గ్లాసు రసంలో ఒక స్పూన్ తేనె కలిపి ప్రతీ రోజు తీసుకుంటే గుండెజబ్బులు, మూత్రపిండాల వ్యాధులు రాకుండా చూస్తుంది. మలబద్ధకం ఉన్నవారు కూడా ప్రతీ రోజు పుచ్చకాయ తింటే ఉపయోగం ఉంటుంది. జ్వరంతో ఉన్నవారు పుచ్చకాయ రసంలో తేనె కలిపి సేవిస్తే నీరసం తగ్గి శక్తి పెరుగుతుంది. పుచ్చకాయలో పిండిపదార్థాంతో పాటు విటమిన్ ఏ, బీ1, బీ6, సీ, పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం, ఐరన్, పీచుపదార్థం వంటి పోషకాలు ఉంటాయి. రక్తప్రసరణ మెరుగుపడేలా, కిడ్నీలు పని చేసేలా చేస్తాయి. రక్తపోటు, జీవక్రియ చురుగ్గా సాగడానికి ఎంతో తోడ్పడుతుంది.

– కె.ప్రియాంక, ప్రభుత్వ వైద్యాధికారి, గణపవరం



పుత్ర గణపతి వ్రత పూజలు



భీమవరం టౌన్, మార్చి 13: మెంటే వారి తోటలోని శ్రీబాలత్రిపుర సుందరిదేవి అమ్మవారి దేవస్థానంలో సంప్రదాయబద్ధంగా పుత్ర గణపతి వ్రత పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన తెలగంశెట్టి శ్రీనివాస్‌రావు, లక్ష్మి చంద్ర దంపతులు, రిత్విక్‌లచే ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ మట్టి గణపతికి కుంకుమ పూజలు వేదమంత్రాలతో హోమాలు నిర్వహించారు. అనంతరం గారెలు, బొబ్బట్లు, ఉండ్రాళ్ళతో ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

నేడు మునిసిపల్ సమావేశం

నరసాపురం టౌన్, మార్చి 13: మునిసిపల్ కార్యాలయంలో గురువారం కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వెంకటేశ్వరావు తెలిపారు. చైర్‌పర్సన్ వెంకటరమణ అధ్యక్షతన ఉదయం 10గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

ఇంటి స్థల హక్కు పత్రాల పంపిణీ

నరసాపురం టౌన్, మార్చి 13: పట్టణంలోని 2వ వార్డులో బుధవారం చైర్‌పర్సన్ వెంకటరమణ రిజిస్ట్రేషన్ చేసిన ఇంటి స్థల హక్కు పత్రాలను లబ్ధిదారులకు అందించారు. నవరత్నాల కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన హామీకి అనుగుణంగా కుల,మతాలకు అతీతంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

బాధితులకు ఉచితంగా మందుల పంపిణీ



మందులు పంపిణీ చేస్తున్న కొవ్వలి నాయుడు

నరసాపురం టౌన్, మార్చి 13: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులకు కొవ్వలి ఫౌండేషన్ ద్వారా ప్రతి నెల మందులు అందిస్తున్నారు. దానిలో భాగంగా బుధ వారం టీడీపీ నాయకులు కొవ్వలి నాయుడు తన నివాసంలో బాధితులకు మందులు పంపిణీ చేశారు. గత రెండేళ్ళగా ట్రస్టు తరుపున నియోజకవర్గం లోని చాలా మందికి విద్య, వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. రాజకీయాల కు అతీతంగా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు కొవ్వలి తెలిపారు.

మంచినీటి చెరువు పరిశీలన

నరసాపురం టౌన్, మార్చి 13: పట్టణంలోని మునిసిపల్ మంచినీటి చెరువును బుధవారం కమిషనర్ వెంకటేశ్వరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెరువులో నీటి సామర్థ్యం, ఫిల్టర్‌బెడ్‌లు, క్లోరినేషన్ తదితర వాటిని పరిశీలించారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇక్కట్లు లేకుండా చెరువును పూర్తి స్థాయిలో నింపాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈ రమేష్‌బాబు, ఏఈ సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

జనంలోకి జనసేన

నరసాపురం టౌన్, మార్చి 13: జనంలోకి జనసేన కార్యక్రమం పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో బుధవారం జరిగింది. జనసేన కన్వీనర్ బొమ్మిడి నాయకర్ మార్కెట్‌లో తిరుగుతూ కరపత్రాలందించారు. వైసీపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో తరిమికొట్టి టీడీపీ, జనసేన కూటమిని గెలిపించాలని విన్నవించారు.



పాఠశాలకు కంప్యూటర్ కుర్చీలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

చదువుతో పాటు సత్ప్రవర్తన ముఖ్యం: డీఈవో

కాళ్ళ, మార్చి 13 : విద్యార్థులకు చదువుతోపాటు సత్ప్రవర్తన ముఖ్యమని అదే మన తల్లిదండ్రులకు గౌరవాన్ని తెస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్. వెంకటరమణ అన్నారు. ఏలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983-84 సంవత్సరం పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయంతో సుమారు రూ.1.50లక్షల విలువైన 30 కంప్యూటర్ కుర్చీలు డీఈవో వెంకటరమణ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతిరాజు జగ్గరాజు, ఎంపీటీసీ చిన్నారపు రాంబాబు, పూర్వ విద్యార్థులు మంతెన రవివర్మ, మాణిక్యాలరావు, మోహనలక్ష్మి, ప్రధాన ఉపాధ్యాయుడు జీవీ సత్యనారాయణరాజు, మంతెన రామకృష్ణంరాజు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వరలక్ష్మి పాల్గొన్నారు.

గురువుకు వీల్‌చైర్ అందజేత

భీమవరం టౌన్,మార్చి 13: తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుకు పూర్వవిద్యార్థులు వీల్ చైర్ అందించారు. వాడ్రేవువారి వీధిలో రోటరీ ఉచిత వికలాంగుల పాఠమిక పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు సుజాత ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు (1991-2009) వీల్‌చైర్‌ను అందించారు. పూర్వ విద్యార్థులు దిడ్ల సురేష్, గుత్తుల గోవింద్, రంగలక్ష్మి, జి పెద్దింట్లు, సౌదామి ని, టి శంకర్, కే శ్రీనివాసరెడ్డి, ఎం నాగేంద్ర, కే మురళి, నల్లారి పెద్దింట్లు, కరుకు వెంకటపతిరాజు, నిమ్మల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రోడ్ సేఫ్టీ ఎన్‌జీవో సభ్యుడిగా రంగసాయి



ఆర్డీవో నుంచి నియమక పత్రాన్ని అందుకుంటున్న రంగసాయి

భీమవరం టౌన్, మార్చి 13 : వాహనాల హిట్ అండ్ రన్ మోటార్ యాక్సిడెంట్ పరిహార కమిటీ (రోడ్ సేఫ్టీ ఎన్‌జీవో) సభ్యులుగా సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి ఎన్నికయ్యారని ఆర్డీవో ఆర్.ఉమా మహేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో నియామక పత్రాలను అందించారు. ఈ కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వ్యవహరిస్తున్నారని, రోడ్డు ప్రమాదాలలో మరణించిన వారికి క్షతగాత్రులకు పరిహారం అందించడానికి ఈ కమిటీ వ్యవహరిస్తుందని అన్నారు. ప్రతి మూడు నెలలకు సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.

లైసెన్స్‌లు, మందులపై దృష్టి పెడతాం



అధికారులతో మాట్లాడుతున్న భీమవరం ఏడీఎఫ్ శ్రీనివాసరావు

ఆకివీడు, మార్చి 13: ఏపీ ఫిషరీస్ సదా యాక్టు అమలు చేయాలని భీమవరం ఏడీఎఫ్ జి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక ఫిషరీస్ ఆక్వా ల్యాబ్..శిక్షణకేంద్ర కార్యాలయంలో ఆకివీడు, ఉండి, కాళ్ళ మండలాల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మత్స్యకారుల సొసైటీలు, ల్యాబ్ శ్యాంపిల్స్ టార్గెట్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. త్వరలో దుకాణాల్లో లైసెన్సులు, మందులు తదితర వాటిపై దృష్టి సారిస్తామన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో వివేక్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి మంచాలు వితరణ

భీమవరం టౌన్, మార్చి 13 : తాడేరు రోడ్డులోని భీమవరం వృద్ధుల ఆశ్రమంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో దాతల సహకారంతో మంచాలను అందించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ అర్జున్ స్టీల్ అధినేత చల్ల గంట్ల సూర్యనారాయణ మనువడు నందన సాయి అర్జున్ మొదటి పుట్టినరోజు సందర్భంగా 15 మంచాలను అందించామని తెలిపారు. కార్యక్రమంలో విజయవాడకు చెందిన వ్యాపారవేత్త మిత్తింటి మధుసూధన్ రావు, ఆశ్రమ నిర్వాహకులు నిమ్మపూడి లక్ష్మి నారాయణ, భట్టిప్రోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.







వల్లూరులో పితాని సత్యనారాయణ ప్రచారం.. తణుకులో ఆరిమిల్లిని కలిసిన బీజేపీ నాయకులు.. తాడేపల్లిగూడెంలో ఆంజనేయ స్వామికి బొలిశెట్టి పూజలు

కూటమి అభ్యర్థుల విజయం తథ్యం: పితాని

ఆచంట, మార్చి 13: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ బీజేపీ జనసేన కూటమి అభ్యర్థుల విజయం తథ్యమని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. బుధవారం వల్లూరులో ప్రజల వద్దకు పితాని ఎన్నికల ప్రచార పాదయాత్ర నిర్వహించారు. రాష్ట్రంలో 165 పైబడిసీట్లు బీజేపీ జనసేన కూటమి గెలుస్తుందని చెప్పారు. జగన్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు. రాష్ట్రంలో మద్యం, ఇసుక మాఫియా ఆగడాలు పెరిగిపోయాయని అన్నారు.

ఆరిమిల్లి గెలుపునకు బీజేపీ నాయకుల మద్దతు

తణుకు, మార్చి 13: టీడీపీ, జనసేన, బీజేపీ తణుకు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ గెలుపే ధ్యేయంగా సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు బీజేపీ పట్టణ నాయకులు అన్నారు. బుధవారం ఆరిమిల్లిని ఆయన నివాసంలో పలువురు నాయకులు కలసి పుష్పగుచ్ఛం అందించి తమ మద్దతు తెలిపారు. బీజేపీ నాయకులు మేకా చంద్రమౌళి, హెచ్‌వీ రామారావు, పెదమల్లు అవినాష్ కాంత్, బొల్లాడ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



చింతలగర్వులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే నిమ్మల సతీమణి సూర్యకుమారి

కూటమి ప్రభుత్వంతోనే అన్నివర్గాలకు మేలు

పోడూరు, మార్చి 13: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని పాలకొల్లు ఎమ్మెల్యే రామానాయుడు సతీమణి నిమ్మల సూర్యకుమారి అన్నారు. చింతలగర్వులో బుధవారం ఆమె ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ నిత్యం మమేకమై ఉన్న కూటమి అభ్యర్థి రామానాయుడును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పాదయాత్రలో అడుగడుగునా సూర్యకుమారికి మహిళలు నీరాజనాలు పలికారు. కూటమి ప్రభుత్వం చేపట్టబోయే పథకాలను వివరిస్తూ, మహిళలు, వృద్ధులను ఆప్యాయతగా పలకరిస్తూ చిన్నారులతో ముచ్చటిస్తూ పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, సర్పంచ్ వడ్లపాటి రాజేంద్రప్రసాదు, ఎంపీటీసీ విప్పర్తి శారద, మాజీ ఎంపీటీసీ శీలం శ్రీనివాసరావు, గూడూరి భవాని, పాలా నాగలక్ష్మి, దేవరపు పద్మావతి పాల్గొన్నారు.

కూటమి విజయం ఖాయం: బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 13: రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి భారీ విజయం ఖాయమని తాడేపల్లిగూడెం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నుంచి ఉమ్మడి అభ్యర్థిగా అంగీకారపత్రాన్ని తీసుకుని పట్టణానికి వచ్చిన ఆయనకు ఎస్వీఆర్ సర్కిల్ వద్ద కార్యకర్తలు, నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం అంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బొలిశెట్టి నివాసం వరకు ర్యాలీ నిర్వహించారు. జనసైనికులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సరస్వతీ దేవి విగ్రహం అందజేత



కాళ్ళ, మార్చి 13 : కోపల్లె ప్రాథమిక పాఠశాల ఆవరణలో గ్రామ సర్పంచ్ బి.నాగమణి దంపతులు సుమారు రూ.40వేలు విలువ చేసే సరస్వతిదేవి విగ్రహం ఏర్పాటు చేశారు. బుధవారం పాఠశాల ప్రాంగణంలో విగ్రహం ఏర్పాటు చేయగా విద్యార్థులతో చదువుల తల్లి సరస్వతీదేవి ప్రార్థన చేశారు. ఉప సర్పంచ్ బి.పరాలు దంపతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రం తనిఖీ

ఉండి, మార్చి 13: ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని రీజనల్ ఇన్‌స్పెక్టర్ అధికారి చంద్రశేఖర్ తనీఖీ చేశారు. బుధవారం యండగండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రానికి విచ్చేసి పరీక్షల తీరును పరిశీలించారు. ఇంటర్ రెండోవ సంవత్సరం ఫిజిక్స్‌కు 163మందికి గాను ముగ్గురు గైర్హాజరయ్యారు. అర్థికశాస్త్రం 24మందికి గాను ఇద్దరు గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు 15మంది హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ టిఎస్ పెద్దిరాజు తెలిపారు.

ప్రతి అంశంపై అవగాహన ఉండాలి

భీమవరం, మార్చి 13 : ఎన్నికల ప్రక్రియలోని ప్రతి అంశంపై అవగాహన, పూర్తి స్పష్టత ఉండాలని ఉండి నియోజకవర్గ అధికారులను జాయింటు కలెక్టరు సీ.వి. ప్రవీణ్ ఆదిత్య ఆదేశించారు. బుధవారం జేసీ ఛాంబర్‌లో ఉండి నియోజకవర్గ నాలుగు మండలాలు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌తో సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నోటిఫికేషన్ జారీ నుంచి నామినేషన్లు, పోలింగు, లెక్కింపు, ఫలితాలు వెల్లడి తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా అమలు చెయ్యాలని అలసత్వం, అశ్రద్ధ వహించితే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఎన్నికల కమిషన్ హ్యాండు బుక్‌లోని ప్రతి చాప్టరును క్షుణ్ణంగా చదవాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన మరుక్షణం నుంచి ఆయా కార్యాలయాలలో ప్రజాప్రతి నిధులతో కూడిన చిత్రపటాలు, ముఖ్యమంత్రి, తదితరులతో ప్రచురించబడిన ఇతర వాల్ పోస్టర్లను తొలగించాలన్నారు. అలాగే వివిధ రాజకీయ పార్టీల వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీలను తొలగించాలన్నారు. రాజకీయ నాయకులను కలిసే ప్రయత్నాలను ఎంత మాత్రం చేయకూడదన్నారు.

రహదారిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి



సమస్యలపై స్థానికులతో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

ఉండి, మార్చి 13: శ్మశానవాటికకు వెళ్లే దారిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని కేసు నమోదు చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం వాండ్రం లంకలో ఆక్రమణకు గురైన శ్మశాన వాటిక భూమిని ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విక్టర్‌ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శ్మశానవాటిక లేని దళితవాడలకు సంఖ్యను బట్టి శ్మశాన వాటికలను కేటాయించి వాటిని ఆక్రమణకు గురికాకుండా చుట్టూ కంచె వేయాలని జీవో జారీ చేసినట్లు ఆయన అధికారులకు సూచించారు. దళితవాడకు వెళ్లేందుకు వున్న 18అడుగుల రహదారిని సైతం ఆక్రమించారని విక్టర్‌ప్రసాదు దృష్టికి దళితనాయకులు తీసుకుని రావడంతో శ్మశాన వాటిక స్థలాన్ని సర్వేచేసి దళితులకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులురాజు, మండల అధికారులు, ఎస్సీఎస్టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యులు పొన్నమండ బాలకృష్ణ, చీకటిపల్లి మంగరాజు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ పాల్గొన్నారు.

గీతాంజలి మృతికి సంతాపం

ఇరగవరం, మార్చి 13 :ఒక బీసీ మహిళ గీతాంజలిని సోషల్ మీడియాలో మానసికంగా వేధించడం వల్ల ఆమె ఆత్మహత్యకు కారణమైందని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆరోపించారు. తణుకులో బుధవారం గీతాంజలి ఆత్మహత్యకు నరేంద్ర సెంటర్‌లో మహిళా విభాగం తెలిపిన నిరసనకు మంత్రి కారుమూరి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆమె కుటుంబానికి రూ. 20లక్షలు ఆర్థిక సాయంతోపాటు అండగా నిలబడతానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహకర్ అన్సారీ తదితరులు ప్రసంగించారు.

వైసీపీకి తెన్నేటి సురేశ్ రాజీనామా

నరసాపురం టౌన్, మార్చి 13: వైసీపీ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెన్నేటి సురేష్ పదవికి, పార్టీకి రాజీనామా చేశారు. బుధవారం రాజీనామా పత్రాలను పార్టీ కార్యాలయానికి పంపించినట్లు ఆయన చెప్పారు. వైసీపీ అవలంబించిన విధానాలు, ఎస్సీ కార్పొరేషన్ నిధుల నిర్వీర్యం, దళితులకు అందించే పథకాలను రద్దు చేయడం వంటి వాటి వల్ల దళితులకు అన్యాయం జరుగుతుందన్న ఉద్దేశంతోనే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు సురేష్ చెప్పారు.

న్యాయవాది జాన్ కెనడి మృతి

పాలకొల్లు రూరల్, మార్చి 13: పాలకొల్లు పట్టణానికి చెందిన న్యాయవాది దేవ జాన్ కెనడి (59) బుధవారం సాయంత్రం ఆయన నివాసంలో మృతి చెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కెనడి మృతికి స్థానిక ఎమ్మెల్యే రామానాయుడు పాలకొల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తలుపుల శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు జీవీ సుబ్బారావు, కెర్నేన గోరినాయుడు, పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, మానవతా సంస్థ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, టౌన్ హాల్ అధ్యక్షుడు పోలిశెట్టి రాధాకృష్ణ, సెక్రటరీ ముచ్చర్ల ఆదినారాయణ సంతాపం తెలిపారు .

ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతం

భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 13 : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని 50 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించగా జనరల్ విద్యార్థులు 413 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1408 మందికి 1319 మంది హాజరై 89 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎటువంటి కాపీయింగ్, ఇబ్బందులు గాని పరీక్షా కేంద్రాలలో తలెత్తలేదని ఎగ్జామ్స్ కన్వీనర్ చంద్రశేఖర్‌బాబు తెలిపారు.

ప్రతి ఎకరాకు సాగునీరందించాలి



మండల సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు

మొగల్తూరు, మార్చి 13: దాళ్వా సాగుకు ప్రతీ ఎకరాకు సాగునీరు అందేలా సంబంధింత అధికారులు చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సూచించింది. మొగల్తూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈసమావేశంలో ఇరిగేషన్ ఏఈ హరికిషన్ మాట్లాడుతూ వంతుల వారీ విధానంలో సాగునీరు అందిస్తున్నామని ప్రతీ ఎకరాకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ మాట్లాడుతూ మండలంలో 1190 ఎకరాల్లో దాళ్వా సాగు చేపట్టారని ప్రతీ రైతు నుంచి ఈ-కేవైసీ నమోదు తీసుకున్నామన్నారు. గత ఏడాది పంట నష్టం వాటిల్లిన 247 మంది రైతులకు రూ.17లక్షలు నష్టపరిహారం అందించినట్టు వివరించారు. హౌసింగ్, విద్యాశాఖ, ఆరోగ్య శాఖల ప్రగతిని అయాశాఖాధికారులు వివరించారు. ఈసమావేశంలో జడ్పీటీసీ తిరుమాని బాపూజీ, మరో వైస్ ఎంపీపీ కవురు సీతామహలక్ష్మీ, ఎంపీడీవో బాబ్జి రాజు పాల్గొన్నారు.

ఆర్వోప్లాంట్ ప్రారంభం

మొగల్తూరు, మార్చి 13: సర్పంచ్ దాతృత్వంతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం కొత్తపాలెం సర్పంచ్ లోకం నాగలక్ష్మి భర్త నాని తండ్రి పేరిట రూ.3లక్షలు వెచ్చించి గ్రామంలో ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ముందుగా శేరేపాలెంలో రూ.17.4లక్షలతో నిర్మించే ఓహెచ్ఆర్ ట్యాంకు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కొత్తపాలెం గ్రామంలో రూ.కోటి 44లక్షలతో నిర్మించిన సీసీ రహదారులను, గ్రామంలో గోగులమ్మ ఆలయం వద్ద సర్పంచ్ నిర్మించిన కళావేదికను ఆయన ప్రాంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ లోకం నాగలక్ష్మీనాని, ఉప సర్పంచ్ ఆకన కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్ర

పోడూరు, మార్చి 13: గ్రామీణ ప్రాంతా ల్లో సమస్యలను మండల స్థాయి లో పరిష్కరించేందుకు సర్పం చులు, ఎంపీటీసీలు ఇతర ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎమ్మెల్సీ వంకా రవీంద్ర కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ సబ్బితి సుమంగళి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశా నికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతిపక్షాల సూచనలు, పత్రికలలో వచ్చిన కథనాలను పరిగణలోకి తీసుకొని ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తి స్థాయి లో పరిష్కారమార్గం చూపాలని సూచించారు. రైతులకు ధాన్యం సొమ్ములు పడలేదని దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పోడూరు సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, ఎంపీటీసీ అంబటి సుధాకర్ సమావేశంలో తహసీ ల్దార్ మురళీకృష్ణ దృష్టికి తీసుకొచ్చారు. వేడంగిపాలెంలో లోవోల్టేజి సమస్య ఉందని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వేడంగిపాలెం ఎంపీటీసీ దూసనపూడి దొరబాబు ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాసరావు దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో జడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, వైస్‌ఎంపీపీలు ఇందుకూరి శీతారామరాజు చినబాబు, గుబ్బల సత్యనారాయణ, ఎంపీడీవో డి.సుహాసిని, తహసీల్దార్ వివివి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

రేపు సైబర్ నేరాలపై అవగాహన



బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 13: ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించు కుని ఈ నెల 15న సైబర్ నేరాలపై అవగాహన కల్పించను న్నట్టు యూనియన్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక సుబ్బా రావుపేట యూనియన్ బ్యాంకు వద్ద ఆసరా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఆసరా అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి బత్తుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

త్వరగా రేషన్ బియ్యం అందించాలి

ఉండి, మార్చి 13: త్వరితగతిన ఇంటింటికి రేషన్ బియ్యంను కార్డుదారులకు అందించాలని సివిల్‌సప్లయిస్ డీటీ మహేష్ ఎండియు వాహనదారులకు సూచించారు. బుధవారం ఉండిలో ఆయన మాట్లాడారు. 1వ తేదీ నుంచి రేషన్ బియ్యంను కార్డుదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. కార్డుదారులకు ఉచితంగా బియ్యం, నగదుకు పంచదార ఇతర సరుకులు అందిస్తున్నట్లు తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని కార్డుదారులకు ఎండ దెబ్బ తగలకుండా, ఇబ్బంది లేకుండా ఎండియులు సరుకులు సరఫరా చేయాలని సూచించారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై శిక్షణ

భీమవరం, మార్చి13 :ఎన్నికల శిక్షణలో అందించిన సమాచారాన్ని జాగ్రత్తగా అవగాహన చేసుకుని ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి కృషి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఎన్నికల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్స్‌కు బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. పోలింగ్ నిర్వహణ, ఈవీఎంలు వినియోగం, ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఐటి అప్లికేషన్స్, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ సమయంలో పూర్తి అవగాహన చేసుకుంటే ఎన్నికలు నిర్వహణ సులువుగా ఉంటుందన్నారు. జాయింటు కలెక్టరు సి.వి.ప్రవీణ్ ఆదిత్య, జిల్లా శిక్షణ నోడల్ అధికారి కె.సి.హెచ్. అప్పారావు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్ల చిరస్మరణీయురాలు



మొల్ల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితరులు

భీమవరం, మార్చి 13 : తొలి తెలుగు మహిళా కవయిత్రి ఆతుకూరి మొల్ల చిరస్మరణీయులని జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తొలి తెలుగు మహిళా కవయిత్రి ఆతుకూరి మొల్ల జయంతిని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టరు, జాయింటు కలెక్టరు జ్యోతి ప్రజ్వలన చేసి మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కలెక్టరు మాట్లాడుతూ మొల్ల అసలు పేరు ఆతుకూరి మొల్లమాంబ అన్నారు. ఆమె 16వ శతాబ్దపు తెలుగు కవయిత్రి అన్నారు. ఆమె రాసిన రామాయణం 'మొల్ల రామాయణం'గా ఎంతో ప్రసిద్ధి చెంది, రామాయణాన్ని తెలుగులో రాసిన తొలి కవయిత్రిగా కూడా ఆమె ఎంతో పేరు ప్రఖ్యాతలు గాంచిందన్నారు. జిల్లా జాయింటు కలెక్టరు సి.వి. ప్రవీణ్ ఆదిత్య, జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కె.సి.హెచ్.అప్పారావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జి.గణపతి రావు పాల్గొన్నారు.

అత్తిలి: తెలుగులో రమాయణాన్ని రచించిన మొల్లమాంబ 584వ జయంతి వేడుకలను తణుకు, అత్తిలిలో ఘనంగా నిర్వహించారు. మొల్లమాంబ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుమ్మర శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు చుంచులు వెంకటేశ్వరరావు అత్తిలి అన్న క్యాంటీన్లో అన్నదానం చేశారు. చుంచుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మొల్లమాంబ రచించిన రామాయణం మొల్ల రామాయణంగా ప్రసిద్ధి చెందిందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మొల్ల జయంతిని రాష్ట్ర అధికార కార్యక్రమంగా నిర్వహిస్తామని ప్రకటించినందుకు హర్షం ప్రకటించారు. టీడీపీ మండల అధ్యక్షులు ఆనాల ఆదినారాయణ, పోలిశెట్టి చంటి, పోలిశెట్టి రంగారావు, దాసరి నాగరాజు, వర్రి శ్రీను, బోడపాటి సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

పెనుమంట్ర, మార్చి 13 : పెనుమంట్రలో బుధవారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి పరీక్షలు చేసి అవసరమైన మందులు, కళ్ళజోళ్లు పంపిణీ చేశారు సుమారు 35 మందికి ఆపరేషన్ పడుతుందని వైద్యులు నిర్ధారించారు ఆపరేషన్ చేయించుకునే వారికి ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో ఐ ఫౌండేషన్ పరమహంస యోగానంద కంటి ఆసుపత్రిలో నిర్వహించనున్నారు.

పెనుమంట్రలో పోలీసు కవాతు



పెనుమంట్ర, మార్చి 13 : పెనుమంట్ర మండలంలోని ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తహల్దార్ కె.లక్ష్మి కళ్యాణి తెలిపారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర పోలీస్ బలగాలు కవాతు నిర్వహించాయి. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకునిలా సానుకూలమైన వాతావరణాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పెనుమంట్ర ఎస్‌ఐ పి.రవీంద్రబాబు తెలిపారు.

నేను పక్కా లోకల్.. పారిపోయేవాడిని కాదు..

భీమవరం రూరల్, మార్చి 13 : జనసేన అధినేత పవన్ కల్యాణ్ మతిస్థిమితం కోల్పోయారని, వెంటనే ఆయనను ఎర్రగడ్డ పిచ్చాసుపత్రికి తీసుకెళ్ళి వైద్యం చేయించాలని జనసేన నాయకులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సూచించారు. పవన్ తనపై చేసిన వ్యాఖ్యలకు స్పందిస్తూ బుధవారం నాడు క్యాంపు కార్యాలయంలో గ్రంధి శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ నేను పక్కా లోకల్ అని, తరిమితే పారిపోయేవాడిని కాదన్నారు. పవన్‌కు పౌరుషం లేదని జనసేన పార్టీని చంద్రబాబు దగ్గర తాకట్టు పెట్టేశారని అన్నారు. తాము ఎవరిపైనా కూడా ఎస్సీ, ఎస్టీ కేసులు ఎక్కడా పెట్టలేదన్నారు. తనపై ఒక్క క్రిమినల్ కేసు కూడా లేదన్నారు. గత 58 నెలలుగా భీమవరం పట్టణంలో, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పవన్‌కల్యాణ్‌కు కనబడటం లేదా అని ప్రశ్నించారు. మెగాస్టార్ చిరంజీవి మహానుభావుడు, వివాద రహితుడు, సౌమ్యుడు అని రాజకీయాలు నచ్చక వెళ్ళిపోయారన్నారు. మాజీ ఎమ్మెల్యే అంజిబాబు ఊసరివెల్లిలా పార్టీలు మార్చే వ్యక్తి అని, ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిన వ్యక్తులను పవన్ పక్కన పెట్టుకున్నారన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

పెంటపాడు, మార్చి 13: అందిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని యువత అన్ని రంగాల్లో రాణించాలని ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. వెంకటేశ్వరరావు అన్నారు. పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జాబ్ మేళాలో 10 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. మొత్తం 165 మంది అభ్యర్థులు హాజరు కాగా ఆయా ఉద్యోగాలకు 55 మంది ఎంపిక అయ్యారన్నారు. కంపెనీ ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

5 పరీక్షా కేంద్రాల ఏర్పాటు



పెంటపాడులో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎం.ఈ.వో శ్రీనివాస్

పెంటపాడు, మార్చి 13: ఈ నెల 18వ తేదీ నుంచి జరిగే టెన్త్ పరీక్షలకు మండలంలో 5 కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడుతూ మండలంలో పెంటపాడు పోస్టుబేసిక్ పాఠశాలలో రెండు కేంద్రాలు, పెంటపాడు డీఆర్ గోయెంకా జూనియర్ కళాశాల, అలంపురం, మీనవల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశామన్నారు. మండలంలో రెగ్యులర్, సప్లిమెంటరీ కలిపి మొత్తం 916 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. కేంద్రాలలో విద్యార్థులకు అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరిక్ష రాసే విద్యార్థులకు ఆయా సబ్జెక్ట్ ల వారీగా ముందుగానే ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మేథాశక్తిని పెంచే పౌష్టికాహారం



ఆరవల్లిలో గృహ సందర్శనలో సూపర్‌వైజర్ పి.సువర్ణ

అత్తిలి, మార్చి 13 : పౌష్టికాహారం పిల్లల మేధాశక్తి, చురుకుదనంపై ప్రభావం చూపుతాయని మంచిలి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ పి. సువర్ణ అన్నారు. ఆరవల్లిలోని 252 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గృహ సందర్శన చేశారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త ఉండ్రాజవరపు రాణి, ఆశ వర్కర్ ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 13: తాడేపల్లిగూడెం పట్టణంలో పలు అభివృద్ధి పనులకు బుధవారం డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన తాను చేసిన అభివృద్ధిపై వివరించారు. ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్రి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.